నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | మార్చి 14, 2024 | www.navatelangana.com

ఘనంగా పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఆరెగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పర్ష చంద్రశేఖర్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివి అందరూ పాస్ కావాలని ఆకాంక్షించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మానస పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోసం మాజీ ఉపసర్పంచ్ రౌతు సంతోష్, ఎస్ఎంసి మాజీ చైర్మన్ చౌదరి నానాజీ, పాఠశాల ఉపాధ్యాయులు జి రవిశంకర్, రాజేశం, రమేష్, అనిత, ఫిరాసత్ అలీ హస్మి, శారద, సిఆర్పి తుకారాం, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



పరీక్షల సమయంలో ఆందోళన వద్దు

సిరికొండ : పరీక్షల సమయంలో విద్యార్థులు ఆందోళనకు గురి కావద్దని మానసిక వైద్యుడు(రిమ్స్) ఓం ప్రకాష్, ఎస్ఐ నవీన్ అన్నారు. బుధవారం కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మానసికంగా ప్రశాంతంగా ఉండాలన్నారు. మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని, సమయానికి నిద్ర పోవాలని అన్నారు. మంచి క్రమశిక్షణను అలవరచుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రమేష్, ఎస్ఓ సంధ్యారాణి పాల్గొన్నారు.



ప్రత్యేకాధికారులకు పరీక్షే..!

- సతమతమవుతున్న స్పెషల్ ఆఫీసర్స్
- గ్రామపాలనతో సంబంధం లేని శాఖల అధికారులు
- ఇటు మాతృశాఖకు, అటు అదనపు బాధ్యతలకు జరగని న్యాయం
- సవాల్‌గా పన్నుల వసూలు..నీటి ఎద్దడి



ఆడే ప్రకాష్ గజిటెడ్ అధికారి. గోయగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీజీ హెచ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మండలానికి నోడల్ అధికారిగా నియమించారు. ఇటీవల సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ఫిబ్రవరి 2నుంచి ప్రత్యేక పాలనను తీసుకొచ్చింది. దీంతో సదరు అధికారికి 5 పంచాయతీల బాధ్యతలు కేటాయించారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా పర్యవేక్షిస్తున్న ఆయన మళ్లీ 5 పంచాయతీల బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తోంది. ఇలా ప్రత్యేక అధికారులుగా నియమితులైన ప్రతి అధికారికి రెండు బాధ్యతలు నిర్వర్తించడం సవాల్‌గా మారింది. ఇటు మాతృశాఖకు, అటు అదనపు బాధ్యతలకు సరైన న్యాయం చేయలేక సతమతమవుతున్నారు.

నవతెలంగాణ-కెరమెరి

గ్రామపంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం నెల క్రితం ముగియగా.. ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. జిల్లాలోని 334 గ్రామపంచాయతీలకుగాను మొత్తంగా 126 మంది గెజిటెడ్ అధికారులకు స్పెషలాఫీసర్లుగా బాధ్యతలు కేటాయించారు. వీరిలో ఒక్కొక్కరికి రెండు నుంచి నాలుగు పంచాయతీల చొప్పున బాధ్యతలను అప్పగించారు. అయితే, ఈ అధికారులందరూ వివిధ ప్రభుత్వ శాఖల్లో కీలకమైన అధికారులే. దీంతో అటు మాతృశాఖ, ఇటు పంచాయతీల విధులు నిర్వర్తిస్తూ సమన్యాయం చేయాల్సి ఉంటుంది. కానీ శాఖాపరమైన పనులతో ఒత్తిడి ఎదుర్కొంటున్న వీరికి పంచాయతీల అదనపు బాధ్యతలు అప్పగించడంపై ఒత్తిడి ఎదుర్కొంటున్నారు.

సవాల్‌గా ఇంటి పన్నుల వసూలు

అదనపు బాధ్యతలకు ఇంటి పన్నుల వసూలు, నీటి సమస్యలు వీరికి తలనొప్పిగా మారాయి. మార్చి 31లోపు వంద శాతం ఇంటి, వాణిజ్య పన్నుల వసూళ్లకు అధికారులు ఒత్తిడి పెంచుతున్నారు. గడవులోగా వసూళ్లను పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. దానికి అనుగుణంగా స్పెషల్ ఆఫీసర్లను సన్నద్ధం చేస్తున్నారు. దీనికి తోడు వేసవి ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అనేక గిరిజన, మారుమూల గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్యలు తలెత్తుతున్నాయి. గతంలో స్థానికంగా ఉండే సర్పంచులు నీటి సమస్యలు తీర్చేవారు. ఇప్పుడు స్పెషల్ అధికారులు స్థానికంగా ఉండరు. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు. ట

పల్లె పాలనతో సంబంధం లేని శాఖలు

ప్రభుత్వం గతంలో మాదిరి పంచాయతీ రాజ్‌శాఖ నుంచే కాకుండా ఇతర శాఖల అధికారులను సైతం గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా నియమించింది. గ్రామపాలనకు సంబంధం లేని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఆర్అండ్‌బీ, జలవనరులు, మున్సిపల్, వ్యవసాయం, వైద్యారోగ్య, ఉద్యానవన, పశుసంవర్ధక, విద్యాశాఖ తదితర శాఖల అధికారులు ఇందులో ఉన్నారు. అనుభవం లేని అధికారులు ఈ బాధ్యతలను నిర్వర్తించాలంటే కొంత సవాలేనని చెప్పొచ్చు. రాష్ట్ర ప్రభుత్వం 2018లో పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేశాక పంచాయతీల బాధ్యతలు మరింతగా పెరిగాయి. దీని ప్రకారం ప్రజలకు మెరుగైన పాలన అందాలంటే క్రమం తప్పకుండా గ్రామపంచాయతీని సందర్శించి రోజువారీ పనులను పర్యవేక్షించాలి. అలాంటప్పుడు మాతృశాఖలో విధులు నిర్వర్తించడం ఎలా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యే వరకు అదనపు బాధ్యతలు నిర్వహించడం తలకు మించిన భారమేనని పలువురు ప్రత్యేకధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అనేక బాధ్యతలు..

పంచాయతీల ప్రత్యేకాధికారులు రెండు నెలలకోసారి గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రధానంగా పల్లెల్లో పచ్చదనాన్ని పెంచడానికి నర్సరీల ఏర్పాటు, మొక్కలు నాటించి సంరక్షించటం, ఉపాధి పనులు, రికార్డుల నిర్వహణ, పారిశుధ్యం, తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలి. అలాగే గ్రామాల్లో సీజనల్ వ్యాధుల కట్టడి, సిబ్బందికి జీతభత్యాలు, పన్నుల వసూళ్లు, విష జ్వరాలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం వంటివి కీలకంగా ఉంటాయి. పలు ఇతర శాఖల్లో పనిచేస్తూ ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారు ప్రజా సమస్యల పరిష్కారంలో ఏ మేరకు సఫలీకృతం అవుతారో తేలాలంటే కొన్ని రోజులు వేచిచూడాల్సిందే.

అంగన్వాడీలో ఎన్నో ప్రయోజనాలు



నవతెలంగాణ-జైనథ్

అంగన్వాడీ కేంద్రంలో పిల్లలను చేర్పడం ద్వారా వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని జిల్లా శిశు సంక్షేమ అధికారి సబిత అన్నారు. బుధవారం మండలంలోని మేడిగూడ గ్రామంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించే ప్రీస్కూల్ కార్యక్రమాల్లో పిల్లలను భాగస్వామ్యం చేయడం ద్వారా వారు శారీరకంగా, మానసికంగా, భాషాపరంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. గర్భం దాల్చిన సమయం నుంచి పిల్లలకు రెండు సంవత్సరాల వరకు గల వెయ్యి రోజుల కాలవ్యవధిలో తీసుకోవలసిన పోషకాహారం, రక్తహీనత నివారించే రోగనిరోధక శక్తిని పెంచే ఆహారం గురించి వివరించారు. దీనిపై గర్భిణులు, కిశోర బాలికలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిడిపిఓ నర్సమ్మ కృష్ణవేణి, సూపర్వైజర్ అన్నపూర్ణ, అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు, కిశోర బాలికలు, మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ కోటేశ్వర్, ఆర్థిక అక్షరాస్యత నిపుణుడు నిఖిలేశ్వర్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

ఆసిఫాబాద్ : మహిళలు అన్ని రంగాలలో రాణించి అభివృద్ధి చెందాలని జీసీడీఓ కె.శకుంతల, ఎటివో కరుణశ్రీ అన్నారు. జిల్లా కేంద్రంలోని షిర్డీ సాయి మందిరంలో మంగళవారం సాయంత్రం ఆసిఫాబాద్ కవుల సంఘం(ఆకసం) ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళ దినోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయమన్నారు. మహిళలు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికురాలు పెంటబర్తి పెంటుబాయి, ఆశ్రమ పాఠశాల అవుట్ సోర్సింగ్ వంటమనిషి నైతం తారబాయిని శాలువాలతో సత్కరించి నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆకసం అవధాని కవి మాడుగుల నారాయణ మూర్తి, గౌరవ అధ్యక్షులు గుర్రాల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చిలుకూరి రాధాకృష్ణ చారి, వ్యవస్థాపకులు నల్లగొండ రమేష్, తాటిపెల్లి జ్యోతి, కవులు ధర్మపురి వెంకటేశ్వర్లు, కిల్లి వెంకట్రావ్, మడిశెట్టి శ్రీనివాస్, రేవతి, శ్రీదేవి, సరిత, శ్రీలత, గౌరి పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు



తలమడుగు : ఖోడద్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు బుధవారం వీడ్కోలు పలికారు. ఇదే పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు పీజీ హెచ్ఎంగా పదోన్నతులు పొందిన విజయలక్ష్మి, వెంకన్నను కూడా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులంతా కష్టపడి చదివి అధిక శాతం జీపీఏ కోసం ప్రయత్నం చేయాలన్నారు. జీపిఏ ఆధారంగానే మంచి కళాశాలలో మంచి కోర్సు పొందే అవకాశం కల్గుతుందన్నారు. పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులు విజయలక్ష్మి, వెంకన్న మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు పాఠశాలలో పనిచేసి చాలా సంతృప్తి పొందామన్నారు. ఇక్కడి విద్యార్థులు క్రమశిక్షణతో పాటు చదువులో కూడా రాణిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాకి ఆనంద్, గ్రామ పెద్దలు బాబుఖాన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్, ఉపాధ్యాయులు లక్ష్మి సుకుమార్ పెట్కులే, వాసుదేవ్, సత్యనారాయణ, సురేఖ, మమత, కిరణ్ కుమార్, సత్యమ్మ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

సిరికొండ : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని వాయిపేట్ సెక్టార్ సూపర్వైజర్ విమల అన్నారు. బుధవారం మండలంలోని మల్లాపూర్ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణీలు ప్రతి నెల ఏఎన్సీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అప్పుడే పుట్టిన పిల్లలకు ముర్రుపాలు తాగించాలన్నారు. తల్లి పాలు తాగించాలని తెలిపారు. వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ అంజలి, ఏఎన్ఎం దేవిక, ఆశా వర్కర్ సునీత, వీవోఏ గంగామణి పాల్గొన్నారు.

పదిలో మంచి మార్కులు సాధించాలి

బోథ్ : పదవ తరగతిలో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని సిఐ రమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో పోలీస్ భూసా లక్ష్మణ్ సహకారంతో పదో తరగతి విద్యార్థులకు సిఐ పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తమ తల్లిదండ్రుల కలను సహకారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఉమేష్‌రావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ఆదిలాబాద్‌టౌన్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డీఎడ్, బీఎడ్ పూర్తి చేసిన ఎస్సీ నిరుద్యోగుల నుండి ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్టడీ సర్కిల్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ డా.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఏప్రిల్ 3 నుండి జూన్ 2 వరకు రెండు నెలల పాటు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. అభ్యర్థులు ఈ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇజ్రాయిల్‌లో విదేశీ ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్ : ఇజ్రాయిల్‌లో విదేశీ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్పెంటర్, సిరామిక్ టైలరింగ్, ప్లాస్టరింగ్, ఐరన్ బెండింగ్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, పదో తరగతి ఉత్తీర్ణత పొంది మూడు సంవత్సరాల అనుభవం ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. దీనికోసం టామ్ కం కంపెనీ ఆధ్వర్యంలో మార్చి 31 నుండి ఏప్రిల్ మూడో తేదీ వరకు హైదరాబాద్‌లో స్కిల్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి గలవారు మరిన్ని వివరాల కోసం 9985483931, 8247838789, 7893566493 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

గోడం నగేష్‌కు బీజేపీ టికెట్..!

- సిట్టింగ్ ఎంపీ సోయంకు తప్పని నిరాశ
- పెద్దపల్లి లోక్‌సభ బరిలో గోమాస శ్రీనివాస్
- అధికారికంగా ప్రకటించిన ఆ పార్టీ అధిష్టానం





నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో బీజేపీ నుంచి గోడం నగేష్ బరిలో దిగనున్నారు. బీఆర్ఎస్ నుంచి ఇటీవలే కమలం పార్టీ తీర్థం పుచ్చుకున్న ఆయనకు ఆ పార్టీ అధిష్టానం బుధవారం టికెట్ ఖరారు చేసింది. దీంతో ఆ పార్టీ తరపున ప్రస్తుతం ఎంపీగా ఉన్న సోయం బాపురావుకు నిరాశ ఎదురైంది. ఇన్నాండ్లు ఆ పార్టీ టికెట్ కేటాయింపుపై జరిగిన ఊగిసలాటకు ఆ పార్టీ అధిష్టానం తాజాగా తెరదించింది. ఇదిలా ఉండగా ప్రస్తుత బీజేపీ సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుకు ఈ సారి టికెట్ దక్కే అవకాశం లేదని తొలి నుంచి ప్రచారం జరిగింది. కానీ సోయం మాత్రం కచ్చితంగా తనకే టికెట్ వస్తుందని ధీమాతో ఉన్నారు. తాజాగా ఆ పార్టీ అధిష్టానం ఆయనకు మొండిచేయి చూపడంతో నిరాశకు గురైనట్లు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో ఆయన భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉందని తెలిసింది. కాగా ఆయన కాంగ్రెస్‌లోకి వెళ్తారనే ప్రచారం జరుగుతోంది. మరోపక్క 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి బరిలో దిగిన గోడం నగేష్ రెండో స్థానంలో నిలిచారు. ఇటీవల బీఆర్ఎస్ నుంచి బోథ్ అసెంబ్లీకి పోటీ చేసేందుకు టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నం చేసినా ఆ పార్టీ అధిష్టానం కేటాయించలేదు. దీంతో అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి కొంత సైలెంట్‌గా ఉన్న ఆయన నాలుగు రోజుల క్రితమే బీజేపీలో చేరారు. ఆ పార్టీ అధిష్టానం నుంచి టికెట్ హామీ లభించడంతోనే ఆయన కాషాయ కండువా కప్పుకున్నారని తెలిసింది. తాజాగా కమలం పార్టీ టికెట్ కేటాయించడంతో ఈ సారి లోక్‌సభ బరిలో నిలువనున్నారు. ఇదిలా ఉండగా పెద్దపల్లి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ తరపున గోమాస శ్రీనివాస్ బరిలో నిలువనున్నారు. తాజాగా ఆ పార్టీ అధిష్టానం టికెట్ ఖరారు చేసింది. 2004లో బీఆర్ఎస్ నుంచి చెన్నూర్ లోక్‌సభకు పోటీ చేసిన ఆయన వివేక్ వెంకటస్వామి చేతిలో ఓడిపోయారు. ఇటీవలే బీజేపీలో చేరిన ఆయనకు బీజేపీ అధిష్టానం టికెట్ కేటాయించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఈపీఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ చేయాలి

- కరీంనగర్ ఈపీఎఫ్ కమిషనర్‌కు వినతి
- నెలాఖరులోగా జమ చేస్తామని హామీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

16 నెలలుగా మున్సిపల్ కార్మికుల నుండి కోత విధిస్తున్న ఈపీఎఫ్ డబ్బులు వెంటనే కార్మికుల ఖాతాలో జమ చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కమిటీ సభ్యులు కోరారు. ఈ విషయమై బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో కరీంనగర్ రీజినల్ కమిషనర్ కార్యాలయంలో ఈపీఎఫ్ కమిషనర్ తానయ్యకు మెమోరాండం అందజేశారు. అలాగే ఈఎస్ఐ నిధుల దుర్వినియోగం జరిగిన తీరును ఆయనకు కమిటీ సభ్యులు వివరించారు. కష్టపడి పనిచేస్తున్న కార్మికుల డబ్బులు కాజేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన రీజినల్ కమిషనర్ కార్మికులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నెలాఖరులోగా కార్మికుల ఖాతాలో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో కమిషనర్‌కు యూనియన్ నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు దర్శనాల మల్లేష్, జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల ముకుంద్‌రెడ్డి, ఎడ్ల రమేష్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగం రాజమల్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దర్శనాల నగేష్, ఎం.జనార్ధన్, ఆత్మరామ్, ఎండీ అజీమ్ పాల్గొన్నారు.

మూత్రశాలల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

బేటి బచావో - భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం మండలంలోని చింతగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మూత్రశాలల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణం పనుల్లో సెరామిక్ టైల్స్‌ను వినియోగించాలని, విద్యార్థులకు అనుకూలంగా మెట్లను నిర్మించాలని, నీటి సౌకర్యం కల్పించాలని, మిగిలిన పనులను నాలుగు రోజులలో పూర్తి చేసి ఎంబి రికార్డింగ్ నమోదు చేసి జిల్లా మహిళా సంక్షేమ అధికారికి అందజేయాలని అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్‌ను ఆదేశించారు. పాఠశాల భవనానికి అవసరమైన మరమ్మతుల గురించి వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి ఎం.భరత్ కుమార్‌ను, మిషన్ భగీరథ పైప్ లైన్‌కు మరమ్మత్తులు చేపట్టి తాగునీటి సౌకర్యం కొరకు వాటర్ ట్యాంక్‌ను అమర్చాలని, నల్లాలను బిగించాలని మండల పరిషత్ అధికారి గౌరీ శంకర్‌ను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వంటశాలలను పరిశీలించి, పాఠశాలలో నెలకొన్న సమస్యలపై నివేదిక అందించినట్లయితే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన 2 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ కేంద్రంలో అవసరమైన మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుసుమ సుధాకర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్ : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకొని ఎన్నికల్లో ఓటు వేయాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతోతో కలిసి అదనపు కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా స్వీప్ నోడల్ అధికారి, డీవైఎస్ఓ వెంకటరేశ్వర్లు ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలదేవి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాల కీలకమన్నారు. యువ ఓటర్లతోనే మంచి నాయకత్వం ఎన్నుకోవచ్చని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువత తమ పేర్లను ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం 6, మార్పులు చేర్పులకు ఫారం-8, పేర్ల తొలగింపుకు ఫారం 7ను పూరించి ఇవ్వాలని సూచించారు. దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందన్న విషయాన్ని గ్రహించి నమోదైన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైకే కోర్డినేటర్ సుశీల్ భడ్, రూరల్ తహసీల్దార్ దీలిప్, ఎన్‌వైకే డీజీ నామిని వెంకట్, ఎన్‌వైకే ఆర్పీ మసూద్, కళాశాల ప్రిన్సిపల్ జలగం అనిత, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రపూర్‌లో అంతర్రాష్ట్ర బార్డర్ మీటింగ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు జిల్లాల ఉన్నతాధికారులతో బార్డర్ మీటింగ్ బుధవారం మహారాష్ట్ర చంద్రపూర్‌లోని ఫారెస్ట్ అకాడమిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నాగపూర్ ఐజి డా.చిరాంగ్ డోర్జి పాల్గొని ఇరు రాష్ట్రాలు సమన్వయంతో పనిచేసి ఎన్నికలను సజావుగా నిర్వహించేలా అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సందర్భంలో ఏర్పాటు చేసే చెక్‌పోస్టుల్లో పోలీసులు, ఫారెస్ట్, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులు నిరంతరం వర్యవేక్షిన్తుంటారని తెలియజేశారు. అలాగే బార్డర్‌లో అక్రమంగా అనుమతులు లేకుండా తరలించే మద్యం, డబ్బు, గంజాయి, మాదకద్రవ్యాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని తెలియజేశారు. ఎన్నికల కోడ్ వచ్చిన వెంటనే ఏర్పాటు చేయవలసిన విషయాలపై జిల్లాల వారీగా వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యల్లో భాగంగా పకడ్బందీగా స్పెషల్ పార్టీ బృందాలతో భద్రతను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఎన్నికలలో జరిగిన సంఘటనలను గుర్తు చేస్తూ ఎటువంటి లోటుపాట్లు లేకుండా రానున్న ఎన్నికలను సజావుగా నిర్వహించాలని సూచించారు. మహారాష్ట్ర, ఆదిలాబాద్ జిల్లాల అధికారులు సంయుక్తంగా ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం మట్లాడుతూ జిల్లాలో బేల మండలం శంకర్‌గూడ, జైనథ్ మండలం ఆనంద్‌పూర్, పిప్పర్‌వాడ, భీంపూర్ మండలం కరంజి తలమడుగు లక్ష్మీపూర్, బోథ్ ఘనపూర్‌లో 6 చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్, చంద్రపూర్ కలెక్టర్ వినయ్‌గౌడ్, అదనపు కలెక్టర్ ఆసిఫాబాద్, ఎస్పీఎం సుదర్శన్, యావత్‌మాల్ ఎస్పీ డా. పవన్ బన్సద్, ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

నవతెలంగాణ-నార్నూర్

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సిఐ రహీమ్ పాషా, ఎస్ఐ రవికిరణ్ అన్నారు. మండలంలోని సుంగాపూర్ గ్రామంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. రాథోడ్ తుకారాం ఇంటి వద్ద అమ్మడానికి సిద్ధం చేసిన పది లీటర్ల నాటు సారాను పట్టుకున్నారు. నాటు సారా తయారీకి ఉపయోగించే ఇప్పపువ్వు మిశ్రమం, బెల్లం ధ్వంసం చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చట్ట ప్రకారం శిక్షింపబడతారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలందరూ చట్టానికి లోబడి ఉండాలని, గ్రామంలోని ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు.

20న కోర్టు పాత బిల్డింగ్ పాత సామాగ్రి బహిరంగ వేలం

బోథ్ : జూనియర్ సివిల్ జడ్జి పాత కోర్టు బిల్డింగ్, జడ్జి బంగ్లా పాత సామాగ్రిని 20న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు జడ్జి హుస్సేన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాత కోర్టు ప్రాంగణంలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.10వేల డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు కోర్టులో సంప్రదించాలని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
2
గురువారం | మార్చి 14, 2024 | www.navatelangana.com

నీటి సమస్యలు లేకుండా చూడాలి

నవతెలంగాణ-ఉట్నూర్



గ్రామాల్లో నీటి సమస్యలు లేకుండా చూడాలని ఎంపీపీ పంద్ర జైవంత్ రావు అన్నారు. బుధవారం మండలంలోని తేజాపూర్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా బిగించిన నీటి నల్లలు, సీసీ రోడ్ల మర్మతలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నాణ్యమైన పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను సూచించారు. వేసవి ప్రారంభం నేపథ్యంలో తాగు నీటి ఎద్దడి లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీధరస్ శర్మ ఈజీఎస్ ఏపీఓ రజనీకాంత్, ఎంపీటీసీ లచ్చు పటేల్, ఎంపీటీసీ అనూష ఉన్నారు.

సీఆర్పీల డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-లక్ష్మణచాంద



క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అసోసియేషన్(సీఆర్పీ) 2024 సంవత్సరానికి సంబంధించిన డైరీని నిర్మల్ డీఈఓ రవీందర్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి సీఆర్పీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ ఫిరోజ్, కార్యదర్శులు రాజరత్నం, సభ్యులు నాగలక్ష్మి, గంగామణి, గంగాధర్, సుధాకర్ పాల్గొన్నారు.

యువత ఉద్యోగాల్లో చేరాలి



నవతెలంగాణ-ఉట్నూర్

భవిష్యత్తులో బాగుపడాలంటే యువత ఉద్యోగాల్లో చేరాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కుష్బుగుప్తా అన్నారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో 309 నిరుద్యోగ యువతీయువకులు పాల్గొన్నారు. 17 ప్రముఖ ప్రయివేట్ కంపెనీల హెచ్ఆర్ మేనేజర్‌లు పాల్గొని 108 మంది అభ్యర్థులను తమతమ కంపెనీలో ఉద్యోగాలు కల్పించారు. 41 మందికి శిక్షణ కోసం ఎంపిక చేశారు. ఈ జాబ్ మేళాలో ఐటీడీఏ ఏపీఓ ఆత్రం భాస్కర్, వైటీసీ మేనేజర్ నాగభూషణ్, సీఐ మొగిలి పాల్గొన్నారు.

బాల మేధావి రిషికేష్‌కు సన్మానం



నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలో గల స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అపర బాల మేధావి డొబ్లే రిషికేష్‌ను సన్మానించారు. తను చేసిన రైల్వే కోచ్ రీ డిజైనింగ్ ఆవిష్కరణ జాతీయస్థాయిలో మెప్పు సంపాదించుకొని, రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు తీసుకొని మే 19 జపాన్‌లోని టోక్యో నగరంలో జరుగనున్న సైన్స్ మేళాలో తన ప్రతిభను ప్రపంచ వేదికపై ప్రదర్శించనున్న నేపథ్యంలో, భారత జాగృతి ఎన్జీఓ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో భారత జాగృతి ఎన్జీఓ మండల కన్వీనర్ మైల మహేష్, సభ్యులు సుంకే అనిల్ కుమార్, కోడిపూల ప్రవీణ్, తోగరి శేఖర్, ఇన్‌చార్జి హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ ఫిర్యాదుదారుల వేదిక



నవతెలంగాణ-తాంసి

తెలంగాణ ఉత్తర విద్యుత్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదు వేదికను మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించారు. తాంసి, భీంపూర్, తలమడుగు మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ నెంబర్ ఆఫ్ టెక్నికల్ అధికారి ఎస్.రామకృష్ణతో పాటు విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు, గృహ వినియోగ నూతన మీటర్లతో పాటు వివిధ సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు ఎలాంటి సమస్యలు ఉన్న సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. వ్యవసాయ మోటార్లకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు, శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలు, గ్రామాల్లో విద్యుత్ మీటర్లు ప్రమాదకర స్తంభాల స్థానంలో కొత్త స్తంభాల కోసం ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వాటిని పరిశీలించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మెంబర్ ఆఫ్ ఫైనాన్స్ ఎల్.కిషన్, ఎం.రాజు గౌడ్, మండల ఏఈలు సతీష్ కుమార్, శ్రవణ్ కుమార్, మనోజ్ కుమార్, విద్య శాఖ అధికారులు రామ గౌడ్, ఈదన్న ఉన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు అందజేసిన ఎంపీటీసీ



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని అంకోలి, పొచ్చర, చాందా(టి) గ్రామాల్లో బుధవారం భీంసరి ఎంపీటీసీ బిక్కి గంగాధర్ పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష పాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్న విద్యార్థిని విద్యార్థులు ఇష్టంతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంకోలి, చాందా(టి) పొచ్చర హెచ్ఎంలు నర్సయ్య గ్రామస్తులు బండారి అశోక్, యువ జన సంఘాల నాయకులు లక్ష్మణ్, రాజేశ్వర్, అంబదాస్, గంగాధర్, కపిల్ పాల్గొన్నారు.

పరీక్షకు 568 మంది విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం నిర్వహించిన ఫస్ట్ ఇయర్ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 9388 మంది విద్యార్థులకు గాను 8820 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 568 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ కుమార్ పేర్కొన్నారు.

కళాశాలలో ఆకట్టుకున్న యూత్ పార్లమెంట్



యూత్ పార్లమెంట్‌లో ప్రెసిడెంట్, స్పీకర్, వైస్ ప్రెసిడెంట్‌గా విద్యార్థులు

- ప్రతిభ కనబర్చిన విద్యార్థులు
- పార్లమెంట్‌ను తలపించేలా సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం నేహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్‌ను నిర్వహించారు. పార్లమెంట్‌ను తలపించేల కళాశాల ఆవరణలో సెట్టింగ్‌ను ఏర్పాటు చేశారు. దీనికి అదనపు కలెక్టర్ శ్యామల దేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన యూత్ పార్లమెంట్‌లో విద్యార్థులు అధికార, ప్రతిపక్ష పాత్రాలు పోషించగా విద్యార్థుల ప్రతిభ ఎంతగానో ఆకట్టుకుంది. ఇందులో బీఏ విద్యార్థులు మెంబర్ ఆఫ్ పార్లమెంట్స్‌గా వ్యవహరించారు. స్పీకర్‌గా బీఏ విద్యార్థినీ గాజరి కళ్యాణి, అధ్యక్షులుగా శృతిక, వైస్ ప్రెసిడెంట్‌గా తిలక్, ప్రధానమంత్రిగా టి.ఆర్యన్ రెడ్డి, ప్రతిపక్ష నాయకుడిగా సోహెల్ బేగ్ వ్యవహరించారు. స్పీకరు, ప్రధానమంత్రి ప్రతిపక్ష నాయకులు ఎన్‌సీసీ గాడ్ ఆఫ్ హనర్‌తో రాష్ట్రపతిని ఆహ్వానించడంతో మొదలైన సభ బిల్లును ప్రవేశపెట్టడం, ఆమోదించడం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఉత్కంఠ భరితంగా జరిగిన చర్చ వాస్తవ పార్లమెంటు సమావేశాలను తలపించింది. ఈ సందర్భంగా శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో మాట్లాడుతూ విద్యార్థి లీడర్ నుంచే అనేక మంది రాజకీయాల్లో రాణిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు అవగాహన పెంచుకుంటూ ఓటరుగా నమోదు చేసుకుంటు ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. పార్లమెంట్ ను తలపించేల విద్యార్థులు మంచి ప్రదర్శన కబర్చినట్లు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్ లో అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. నాయకత్వ లక్షణాలు బయటపెట్టేందుకే పార్లమెంట్ నిర్వహించామని ఎన్‌వైకే కోర్డినేటర్ సుశీల్, కళాశాల ప్రిన్సిపల్ జలగం అనిత తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాలకవర్గాలు, ప్రతిపక్షలు ఎలా వ్యవహరిస్తున్నారనే అంశాలపై విద్యార్థులు చక్కగా ప్రదర్శించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ దీలిప్, ఎన్‌వైకే డీజీ నామిని వెంకట్, ఎన్‌వైకే ఆర్పీ మసుద్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేతివృత్తులను కాపాడాల్సిన బాధ్యత అందరిది

నవతెలంగాణ-నిర్మల్

అంతరించిపోతున్న చేతివృత్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇన్నోవేషన్ యాత్రికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిర్మల్ కొయ్యబొమ్మలు, పెయింటింగ్స్‌కి ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాముఖ్యత ఉందని తెలిపారు. విస్తృత ప్రచారం కల్పించాల్సిన బాధ్యత మనందిరిపై ఉందన్నారు. జిల్లా అధికార యంత్రాంగం కళలను ఎంతగానో ప్రోత్సహిస్తుందని తెలిపారు. యువత నూతన ఆవిష్కరణల అన్వేషణలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. కొండాపూర్ గ్రామంలో సమీకృత వ్యవసాయ క్షేత్రంలో సహజ పద్ధతుల్లో వ్యవసాయం, చేపలు, కోళ్ల పెంపకం వంటివి చేపడుతున్నామని తెలిపారు. ఈ ఇన్నోవేషన్ యాత్ర ఈ నెల 12 నుంచి 16 మధ్య జరగనుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల



శాఖ మేనేజర్ నర్సింహారెడ్డి, ఇన్నోవేటివ్ యాత్రికులు, అధికారులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు కారకులైన భర్తకు, అత్తకు ఏడేండ్ల జైలు

నవతెలంగాణ-నిర్మల్

మహిళ ఆత్మహత్యకు కారకులైన భర్తకు, అత్తకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.కర్ణకుమార్ ఏడేండ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారని కోర్టు లైజన్ అధికారి సక్రియ నాయక్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం...ఖానాపూర్ శాంతినగర్‌కు చెందిన బైరి లక్ష్మి(25) కడెం మండలం పాతమద్దిపడగ గ్రామానికి చెందిన రమేష్‌తో 2013లో పెండ్లి జరిగింది. కట్నంగా లక్ష రూపాయలు, తులం బంగారం, ద్విచక్ర వాహనాన్ని ఇచ్చారు. పెళ్లయిన తర్వాత వీరిద్దరూ ఏడాది పాటు అన్యోన్యంగా ఉన్నారు. పాప పుట్టిన తర్వాత బైరి రమేష్ అదే గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమెతో నెలరోజుల పాటు ఎక్కడికో వెళ్లి తిరిగి వచ్చాడు. విషయం తెలుసుకున్న లక్ష్మి, తల్లి కౌసల్య కుల పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించగా, కుల పెద్దలు రమేష్‌కు రూ.20వేల జరిమానా విధించారు. కొద్ది రోజుల తర్వాత రమేష్, భార్య లక్ష్మిని ఇదంతా నీ వల్లనే జరిగిందని, జరిమానా నువ్వే కట్టాలని వేధించాడు. తల్లి జరిమానా డబ్బులు చెల్లించి ఇక నుండైనా సంతోషంగా ఉండాలని నచ్చచెప్పి వెళ్లింది. అయినప్పటికీ రమేష్, అతని తల్లి తార అదనంగా రూ.50వేల కట్నం తీసుకు రావాలని వేధించారు. దీంతో లక్ష్మి భర్త, అత్త పెట్టే వేధింపులు భరించలేక జులై 23, 2017న బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. అప్పటి ఎస్సై జి.రాము కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు 17 మందిని సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయించారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-నిర్మల్

మున్నూరు కాపుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రకటించిన శుభ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షులు యంసి. లింగన్న, మున్నూరు కాపు మిత్ర మండలి అధ్యక్షులు పుప్పాల రమేష్, యువజన మిత్ర మండలి అధ్యక్షులు గంట రాకేష్ సంఘ సభ్యులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్నూరుకాపుల అభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందని, రాజకీయాలకు అతీతంగా సంఘం అభివృద్ధికి కలిసి కట్టుగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్పొరేషన్ వల్ల మున్నూరుకాపు కుల సంఘంలో పేదలకు ఆర్థికంగా మేలు జరుగుతుందని తెలిపారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కార్పొరేషన్ కొరకు కృషి చేశారని, తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు అధ్యక్షుడు కొండ దేవయ్య తన బృందంతో కార్పొరేషన్ కొరకు 10 ఏండ్లుగా కృషి చేశారని అన్నారు. నిర్మల్ జిల్లా, పట్టణ మున్నూరుకాపు సంఘం తరపున రాష్ట్ర ప్రభుత్వానికి, సిఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలియచేశారు.

అక్రమంగా తరలిస్తున్న టేకు ఫర్నీచర్ పట్టివేత

నవతెలంగాణ-కడెం



అక్రమంగ తరలిస్తున్న టేకు ఫర్నిచర్‌ను కడెం ఎఫ్ఆర్ఓ అనిత పట్టుకున్నారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాండ్వాపూర్ అటవీ చెక్ పోస్ట్ మీదుగ బుధవారం టీఎస్18టీ1799 బొలెరోలో జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వస్తాపూర్ తరలిస్తున్న దాదాపు రూ. 80 వేల విలువగల టేకు ఫర్నిచర్‌ను పాండ్వాపూర్ అటవీ చెక్ పోస్ట్ వద్ద మండల అటవీ అధికారి అనిత, అటవీ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. పట్టుకున్న వాహనాన్ని కడెం అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ ప్రకాష్, మండల అటవీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా రమేష్

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సోనాల గ్రామానికి చెందిన బత్తుల రమేష్‌కు జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా టీపీసీసీ స్టేట్ కోఆర్డినేటర్ నవీన్ నియమించారు. సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, జిల్లా నాయకుడు పసుల చంటి, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

పట్టు పురుగుల పెంపకంతో లాభాలు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

పట్టు పురుగుల పెంపకంతో రైతులకు లాభాలు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. బుధవారం మద్ది చెట్లపై పట్టు పురుగుల పెంపకం గురించి మామడ మండలం కప్పనపల్లి అటవీ ప్రాంతంలో చెట్లను పరిశీలించారు. చెన్నూరు నుండి ప్రత్యేకంగా వచ్చిన శాస్త్రవేత్తలు గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి పట్టుపురుగుల పెంపకానికి ముందుకొచ్చిన రైతులకు అవగాహన కల్పించారు. పంట గురించి, నిర్వహణ తీరు రైతులకు తెలియజేశారు. ఈ సమావేశంలో భగవాండ్లు, సిల్క్ సీడ్ సెంట్రల్ డిపార్ట్మెంట్ శాస్త్రవేత్త పట్నాయక్, సీనియర్ శాస్త్రవేత్త పార్వతి, లైసన్ అధికారి, భరత్, డి రాములు, యశ్వంత్, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో ఆవు మృత్యువాత



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మహాగావ్ గ్రామంలో విద్యుత్ఘానికి గురై ఆవు మృత్యువాత పడింది. బాధితుడు తొడసం భూమ తెలిపిన వివరాల ప్రకారం.. ఆవు రోజు మాదిరిగానే మేతకు చేనులోకి వెళ్ళింది. మేత మేస్తు అక్కడ స్తంభం వద్ద ఉన్న వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. అదికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని కోరారు.

గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ (బోథ్) కళాశాలలో కంప్యూటర్ సైన్స్, డాటా సైన్స్, గెస్ట్ ఫ్యాకల్టీగా బోధించుటకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ లక్ష్మీప్రసన్న బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఫస్ట్ క్లాస్ పీజీతో పాటు నెట్, సెట్ లేదా పీహెచ్‌డీ అర్హత, అనుభవం కలిగి ఉండాలన్నారు. ఈనెల 14 నుండి 18 వరకు దరఖాస్తులతో పాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలను సమర్పించాలని సూచించారు.

ఫలించిన రైతుల నిరాహార దీక్ష..బైపాస్ రద్దు



నవతెలంగాణ-బేల

56 రోజుల నుండి బై పాస్‌ను రద్దు చేయాలని రైతులు మండల కేంద్రంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఎట్టకేలకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జాతీయ రహదారి డీఈ రైతుల దీక్ష శిబిరానికి వచ్చి బై పాస్‌ను రద్దు చేస్తున్నామని చెప్పడంతో బేల, శంషాబాద్ మాజీ సర్పంచ్లు రైతుల దీక్షకు నిమ్మరసం ఇచ్చి విరమణ చేయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 56 రోజుల నుండి చేపడుతున్న దీక్షను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదే విధంగా మండలంలోని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. బైపాస్ రోడ్డు అంతరాష్ట్ర రహదారి 353బీ బేల మండల కేంద్రం నుండి బైపాస్ దాదాపుగా 4.50 కిలోమీటర్లు వెళ్తుంది. ఈ బైపాస్ గుండా భూములు కోల్పోతున్న శంషాబాద్, డోప్టాల, మొహబత్ పూర్ రైతులు రోడ్డుపైన వస్తామన్నారు. కేవలం బేల మండలానికి వచ్చే సరికి బైపాస్ రోడ్డును చేపడుతున్నారని పేర్కొన్నారు. ఇక్కడ ఉండే రైతులు చిన్నసన్న కారు రైతుల జీవనదారం వ్యవసాయమన్నారు. ఎక్కువ మంది సన్నచిన్న కారు రైతులు వ్యవసాయ భూమిపైన ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. బై పాస్ రోడ్డును రద్దు చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్ డే



నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నిషయన్ డేను ఘనంగా నిర్వహించారు. ముందుగా ల్యాబ్ టెక్ని షియన్ జీవన్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా డా.సాగర్ మాట్లాడుతూ భారత దేశంలో మార్చి13న లాబోరేటరీ టెక్నీషియన్ డే అనేది ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో వారి అవిశ్రాంత ప్రయత్నలకు కృతజ్ఞతలు తెలిపే రోజు అన్నారు. ఈ కార్యక్రమంలో తలామద్రి పల్లె దవాఖాన వైద్యులు ప్రశాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ



నవతెలంగాణ-ఉట్నూర్

పదవ తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సామాజిక కార్యకర్త, ప్రధాన్ సంఘం మండల అధ్యక్షుడు మెస్రం కేశవ్ రావు అన్నారు. బుధువారం పట్టణంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలలో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్, పెన్సిళ్లను పంపిణీ చేశారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చవాన్ శీతల్, ఉపాధ్యాయులు సంగీత, సురేష్, వాణిశ్రీ, సుజాత, విజయ్, నాయకులు మరప్ప రోహిదాస్, నిరంజన్, జమీర్, విద్యార్థులున్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని ఎలుకపెల్లి గ్రామ పంచాయతీలో ఉపాధిహామీ చట్టంలో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీటీసీ దూగుంట రాజన్న బుధవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. పనుల్లో నాణ్యత పాటించేల చూడాలని కాంట్రాక్టర్‌ను సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేఖర్, కాంగ్రెస్ నాయకులు గణపురం బాపూజీ, మాజీ ఉప సర్పంచ్ రమేష్, పోతపెల్లి మాజీ సర్పంచ్ చంద్రమౌళి, నాయకులు నాగేష్, రమేష్, చందు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని గోయగావ్ గ్రామానికి చెందిన చింత రాంబాయి అనే మహిళ మూడు నెలల క్రితం చనిపోవడంతో ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి పథకం ద్వారా మంజూరైన బీమా డబ్బులను అందించారు. బుధవారం రూ.రెండు లక్షలు మృతురాలి భర్త కైలాష్‌కు బ్యాంకు మేనేజర్ నందకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ విజయ్, పీఎస్‌సీ భిక్షపతి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో పాటు సంస్కారం అందించేవే శిశుమందిరాలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సరస్వతి శిశుమందిర్ పాఠశాలలు విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు సంస్కారాన్ని కూడా నేర్పిస్తాయని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. పట్టణంలోని ద్వారకానగర్ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల 51వ వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సరస్వతి శిశు మందిరాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సరస్వతి శిశు మందిర్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ శాహిన్ సుల్తానా, శిశుమందిర్ మంచిర్యాల్ విభాగ్ కార్యదర్శి దహెగాం గోవింద్ రావు, సమితి అధ్యక్షులు డా.దామోదర్ రావు, ప్రబంధకారిణి కార్యదర్శి పెద్దింటి వెంకట కిషన్ రావు, సమితి అధ్యక్షులు దాసరి వెంకటేష్, సభ్యులు కొండురి రాజయ్య, గుల్లపల్లి భారతి, ఇందూరి వెంకటేశం, పొట్ట రాహుల్, లింగం దయాకర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని భట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ఆనంద ఎడ్యుకేషనల్ అకాడెమీ ఆధ్వర్యంలో ఫౌండర్ పుల్లూరి బాలకృష్ణ ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ బాయి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రోత్సాహం అందించడానికి ముందుకు వచ్చిన ఆనంద ఎడ్యుకేషన్ అకాడమి సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ టీచర్స్ నాగేశ్వర్ రావు, మంగయ్య, గోరేసింగ్, అబ్దుల్ రౌఫ్, నర్మద, విజయ లక్ష్మి, కమలుద్దిన్, కవిత రాణి, సునీత, సీఆర్పీ అర్జున్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ప్రథమ పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ముగిసాయి. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ తెలిపిన వివరాల ప్రకారం ఇంటర్మీడియట్ పరీక్షలు మొదటి సంవత్సరం పూర్తయ్యాయని చివరి రోజు మొత్తం 5324 మందికి గాను, 5046 మంది విద్యార్థులు హాజరు కాగా, 278 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. వీరిలో జనరల్ విద్యార్థులు 4598 గాను 4388 మంది హాజరయ్యారని, 210 మంది గైర్హాజరయ్యారని, ఒకేషనల్ విద్యార్థులు 726 గాను 658 మంది హాజరు కాగా 68 మంది హాజరైనట్లు తెలిపారు. గురువారంతో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు కూడా పూర్తి అవుతాయని తెలిపారు. జిల్లాలో బుధవారం పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు వివరించారు.

ఎంపీడీఓ, ప్రత్యేక అధికారులకు సన్మానం

నవతెలంగాణ-కెరమెరి

నూతనంగా ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన కృష్ణారావుతో పాటు మండలంలోని వివిధ గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా పనిచేస్తున్న పలువురిని ఎంపీపీ పెందూర్ మోతీరాం, జెడ్పీటీసీ ద్రుపత బాయి, వైస్ ఎంపీపీ కలాం శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచుల పదవీకాలం ముగిసిపోవడంతో ప్రత్యేక అధికారులు గ్రామాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఇందులో అంతాపూర్ ఎంపీటీసీ సకరాం, భీంబాయి పాల్గొన్నారు.

ఆస్పత్రి ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా ఆస్పత్రిలో రోగులను కనీసం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో పాటు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాంద్రే విశాల్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రంతో పాటు ఇతర సేవలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాలసిస్ కేంద్రంలో పేదలు చికిత్స పొందుతున్నారని, వారిని పట్టించుకోనే నాథుడు లేడన్నారు. విద్యుత్ సరఫరా ఆగిపోతే రోగులే డీజిల్ కొనుక్కోవాల్సిన దుస్థితి ఉందన్నారు. ఇదే విషయం సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లితే తనకు సంబంధం లేదని, కళాశాల ప్రిన్సిపల్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారని తెలిపారన్నారు. ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా తనకు అధికారికంగా ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. ఇలా ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేద రోగుల పట్ల కనీస కనికరం లేని అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని జిల్లా ఉపాధ్యక్షులు సైదం నాగరాజు పటేల్, గడ్డల ప్రణయ్ పటేల్, బీజేపీ నాయకులు గడ్డల మల్లన్న పటేల్, సాయి, తిరుపతి, పిడుగు మహేష్ పాల్గొన్నారు.



నేడు కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్యే కోనప్ప



కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడుతున్న కోనప్ప

నవతెలంగాణ-కాగజ్‌నగర్

బీఆర్‌ఎస్పీ జిల్లా అధ్యక్షుడు, సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో పాటు ఆయన వర్గీయులు గురువారం కాంగ్రెస్ తీర్థం పుచుకొనున్నారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడి పదవికి రాజీనామాతో పాటు, తన సోదరుడు జడ్పీ ఇన్‌చార్జి చైర్మన్ కోనేరు కృష్ణారావు, కాగజ్ మున్సిపల్ చైర్పర్సన్ షాహిన్ సల్తానా, పలువురు కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు. గురువారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో కాగజ్‌నగర్‌లోని వినయ్ గార్డెన్‌లో రాష్ట్ర మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీదర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు తనపై అసత్యపు ఆరోపణలు చేసి తన ఓటమికి కారకుడైన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్, బీఎస్పీ పొత్తు పెట్టుకోవడం తీవ్రంగా మనస్తాపానికి గురి చేసిందన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, పార్టీపైన తనకు ఏలాంటి విభేదాలు లేవన్నారు. కేవలం బీఎస్పీ, భారాస పొత్తు పెట్టుకోవడం, సిర్పూరు నియోజకవర్గ ప్రజల అభిప్రాయాలు సూచనల మేరకు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడం జరుగుతుందన్నారు.

ఒక్కటైన మామా అల్లుడు

కొన్నేళ్లుగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మధ్య వర్గ విభేదాలున్నాయి. వారిద్దరూ వరుసకు మేనమామ, మేనల్లుడు అవుతారు. కానీ 2004 నుంచి రాజకీయంగా వారి మధ్య విభేదాలున్నాయి. వారి మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ప్రస్తుతం కోనేరు కోనప్ప కాంగ్రెస్‌లో చేరనున్న నేపథ్యంలో అధిష్టానం పిలుపు మేరకు మామ అల్లుడు ఏకమయ్యారు. కోనేరు కోనప్ప నివాసానికి రావి శ్రీనివాస్‌తోపాటు ఆయన వర్గీయులు కలిసి వచ్చి ఒకరి నొక్కరూ అప్యాయంగా పలకరించుకున్నారు. కాంగ్రెస్ అధినేత, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్‌లో చేరనున్న నేపథ్యంలో ఆ పార్టీ డీసీసీబీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, నియోజకవర్గ కన్వీనర్ రావి శ్రీనివాస్, ఈజ్‌గాం శివ మల్లన్న ఆలయ కమిటీ చైర్మన్ మైలారపు మురళీధర్ పలువురు నాయకులు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నివాసానికి తరలివచ్చారు. కాంగ్రెస్‌లో చేరనున్న సందర్భంగా స్వాగతం పలికారు. పార్టీ అధినేత ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్‌లో చేరడంతో పార్టీ మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని డీసీసీబీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ప్రకటించారు.

కౌటాల : కార్యకర్తల బలగంతో కాంగ్రెస్‌లో చేరనున్నట్టు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నన్ను ఓడించిన బీఎస్పీ ప్రవీన్‌కుమార్‌తో కేసీఆర్ పొత్తు పెట్టుకోవడంతోనే కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు కార్యకర్తలకు తెలియజేశారు. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో చేరుతున్నానని, ఈ కార్యక్రమానికి కౌటాల, చింతలమానెపెల్లి, సిర్పూర్, బెజ్జూరు, పెంచికల్‌పేట్, దహెగాం మండలాల నుండి కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెజ్జూరు : సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరుతున్నానని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తెలిపారు. బుధవారం మండలకేంద్రానికి వచ్చిన సందర్భంగా ముఖ్య కార్యకర్తలతో మాట్లాడారు. కాగజ్‌నగర్ మండలం శివమల్లన్న ఆలయ ప్రాంగణంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నట్టు ఆయన తెలిపారు. మండలంలోని ముఖ్య అనుచరులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్, ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు జగ్గాగౌడ్, కొట్రంగి రామకృష్ణ, నరేందర్‌గౌడ్, మహేష్, జావిద్ అలీ, సకారాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

- నామమాత్రంగానే చర్చ

నవతెలంగాణ-కెరమెరి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగానే జరిగింది. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వస భ్య సమావేశానికి ప్రత్యేకాధికారులతో పాటు ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జి వైద్యుడు, డీడీఓ వినోద్ మాట్లాడారు. ఇద్దరు వైద్యులకు గాను ఒక్కరు కూడా లేరని తెలిపారు. ముగ్గురు స్టాఫ్ నర్సులుండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కరే ఉన్నట్లు తెలిపారు. సిబ్బంది పూర్తి స్థాయిలో లేని కారణంగా వైద్య సేవలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని సభ దృష్టికి తీసుకెళ్లారు. పీఆర్ జేఈ స్టీఫెన్ మాట్లాడుతూ మండలానికి 54 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 2కోట్ల 14లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. పీఆర్ 45 సీసీ రోడ్లు పూర్తైనట్లు తెలిపారు. మరో 9 సీసీ రోడ్లపనులు కొనసాగుతున్నాయన్నారు. ఆ తర్వాత పలు శాఖల అధికారులు వారివారి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం మాటడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, నీరు, విద్యుత్ సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భూగర్భ జలాలు అడుగంటి పోతున్న నేపథ్యంలో నీటిఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి తాగు నీటి సమస్య నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతిసారి సమావేశం తూతూ మంత్రంగానే నిర్వహించడంపై కొంతమంది ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం ఎంపీపీ పెందూర్ మోతీరాం మాట్లాడుతూ సభ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సెడ్మకి ధృపత బాయి, ఎంపీడీఓ కృష్ణారావు, ఎంపీఓ అంజత్ పాషా, నోడల్ నోడల్ అధికారి ఆడే ప్రకాష్, ఏఓ గోపికాంత్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్, ఏపీఓ మల్లయ్య, శాఖల అధికారులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెందూర్ మోతీరాం

ఎన్నికలకు సమన్వయంతో పని చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పార్లమెంట్ ఎన్నికల ప్రశాంత నిర్వహణకు రెండు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల అధికారులు సమన్వయంతో పనిచేసుకోవాలని తెలంగాణలోని ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మహారాష్ట్రలోని చంద్రపూర్, యావత్ మాల్ జిల్లాల పోలీస్ అధికారులు నిర్ణయించారు. మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో నాగపూర్ ఐజీ చెర్రింగ్ డోర్జే అధ్యక్షతన ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, చంద్రపూర్ ఎస్పీ ఎం.సుదర్శన్, కలెక్టర్ వినయ్ గౌద్య, యావత్మల్ ఎస్పీ పవన్ దన్‌సూద్ సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో అంతర్రాష్ట్ర సరిహద్దుల మధ్య తీసుకోవాల్సిన భద్రత చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఇరు రాష్ట్రాల సమన్వయంతో పనిచేయాలన్నారు. వివిధ ఆస్తుల దొంగతనాలకు సంబంధించిన కేసులు, ఇతరాత్ర నేరాలు చేసే ముఠాలను పట్టుకోవడం, ఇతర కేసులను సత్వరం పరిష్కరించుకోవడంలో సహకరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రాణా ప్రతాప్, వాంకిడి సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చితకబాదిన అటవీ శాఖ అధికారులు

- రూ.40 వేలు డిమాండ్

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కొత్త దుబ్బగూడ గ్రామానికి చెందిన బొయిరె మల్లేష్, బొయిరె రమేష్, చించోన్కర్ గణపతి అనే ముగ్గురు వ్యక్తులను అటవీ శాఖ అధికారులు చితకబాది,రూ. 40 వేలు డిమాండ్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల తొమ్మిదో తేదీన చేపల వేటకు వెళ్తుండగా అటవీ శాఖ అధికారులు అడ్డుకొని తనిఖీ చేశారు. చేపలు పట్టడానికి ఉపయోగించే వల, కొంత వైర్ సంచిలో ఉండడంతో వన్యప్రాణుల వేటకు ఇవి ఉపయోగిస్తున్నారని బెదిరించారు. అలాంటి పనికి వెళ్లడంలేదని ఎంతచెప్పినా వినకుండా ముగ్గురిని కమాన గ్రామానికి తీసుకెళ్లి చితకబాది పెద్ద కేసులు పెడతామని బెదిరించి రూ.40 వేలు ఇస్తేనే కేసు పెట్టకుండా వదిలేస్తామని చెప్పారు. అటవీ శాఖ అధికారులకు దుబ్బగూడ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ పురుషోత్తం మధ్యవర్తి ద్వారా రూ.25 వేలకు ఒప్పందం కుదిరింది. బుధవారం మధ్యవర్తి ఉప సర్పంచ్ పురుషోత్తం ద్వారా డబ్బులు అటవీ శాఖ అధికారులకు ఇస్తున్న సమయంలో సీక్రెట్ కెమెరా ద్వారా డబ్బులు తీసుకుంటున్నట్టు తీసిన వీడియో బయటకు వచ్చింది. ఈ వీడియోలో కన్నర్‌గావ్ గ్రామానికి చెందిన బీట్ ఆఫీసర్ సాదిక్ హుస్సేన్, అస్రొద్దీన్ ఈ ఘటనకు పాల్పడినట్టు తెలుస్తుంది. మధ్యవర్తి ఉప సర్పంచ్ జిల్లా ఉన్నతాధికారులకు ఈ విషయం తెలపడంతో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని గ్రామస్తులు వేచిచూస్తున్నారు. ఇలాంటి సంఘటన జరగడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు చేపల వేటకు వెళ్లాలంటే భయంభయంగా ఉంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితులు బొయిరె మల్లేష్, బొయిరె రమేష్, చించోన్కర్ గణపతి డిమాండ్ చేశారు.

గ్రంథాలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవన పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. బుధవారం గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసువచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం అవసరమైన పుస్తకాలను అందించి ప్రోత్సహించేందుకు పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

నియోజకవర్గంలోని ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని, దశల వారిగా పనులు చేపడతామని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. మండలంలోని కొత్త అనుకోడ-పాత అనుకోడ మధ్య బీటీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ నిధులు రూ.76 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతోందన్నారు. ఐటీడీఏ ద్వారా ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలోనే ఆ పనులు కూడా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకరయ్య, సర్పంచ్ ధోతుల శ్రీనివాస్, మాన్ సింగ్, ఏఈ భద్రుద్దిన్, ముక్కెర శేఖర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని చెడ్వాయి గ్రామ పంచాయతీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. అనంతరం మహిళలచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కిర్డీ, ఇందాని గ్రామాల్లో కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించి ఇంటింటి సర్వే చేపట్టారు. ఇందులో ఇద్దరు కుష్టువ్యాధి అనుమానితులను గుర్తించి మందులు అందజేశారు. కుష్టువ్యాధి నిర్మూలనకు అందరు సహకరించాలని కోరారు. మండలంలో 35 బృందాలుగా ఏర్పడి ప్రతి గ్రామంలో 14 రోజుల పాటు కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మమత, సుచెరిత, కృష్ణకుమారి, లక్ష్మి, గంగుబాయి, కమల పాల్గొన్నారు.

విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విజయ నిర్మళ అతిథులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి అనంతరం ఉన్నత చదువులు చదవాలని, తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు ఎన్నో సహాయ సహకారాలు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత సంవత్సరం పదో తరగతిలో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులు నాగమణి, శరణ్యకు నగదు బహుమతులతో పాటు ఎలుకపెల్లి గ్రామానికి చెందిన సముద్రాల రాజన్న ఒక గ్రాము బంగారాన్ని విద్యార్థులకు అందజేశారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా ప్రథమస్థానంలో వచ్చిన వారికి మళ్లీ ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలియజేశారు. పదో తరగతి విద్యార్థులకు గ్రామస్తులు జునుగరి భాస్కర్ పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దూగుంట రాజన్న, మండల విద్యాధికారి రమేష్‌బాబు, గ్రామస్తులు నాగేశ్వర్, వైకుంఠం, సాయిరాం, కైరాత్, కృష్ణ, రమేష్, చంద్రమౌళి, మహిళలు సుకన్య, వనిత, ఉపాధ్యాయులు యాదగిరి, భాషా, గంగాభవానీ, నాగేష్, కళావతి, లక్ష్మి, భారతి, శ్రీధర్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 15 నుండి 31 వరకు నిర్వహించే భగత్ సింగ్ 93వ వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి అన్నారు. జిల్లా కేంద్రంలో భగత్ సింగ్ వర్ధంతి వేడుకలకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు దేశంలో ఫాసిజం పెరిగిపోయిందని, విద్యను మొత్తం కాషాయీకరించాలనే నేపథ్యంలో నూతన విద్యా విధానం 2020 తీసుకువచ్చారన్నారు. విద్యార్థుల్లో మతోన్మాదాన్ని పెంచి పోషించడం కోసం అనేక ప్రయత్నాలు చేస్తుందన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, మోడీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీ నెరవేరలేదని అన్నారు. ప్రశ్నించే గొంతులపై ఉప చట్టాలను ప్రయోగిస్తున్నారని, ఎన్నికల నేపథ్యంలో నేడు సీఏఏ తీసుకువచ్చారని, మోడీ మతోన్మాద వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భగత్ సింగ్ ఉద్యమ స్ఫూర్తితో పోరాటం చేయాలని, దీనికోసం నిర్వహించే వర్ధంతి వేడుకలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఎస్‌కే షాహిద్, జాడి విలాస్, రమ్య కుమారి, కళాశాల నాయకులు సునీత, అనూష, సాయిప్రియ, మీనాక్షి, జీవన్, విగ్నేష్, బాలాజీ విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
4
గురువారం | మార్చి 14, 2024 | www.navatelangana.com

టాటా సోలార్ ఆధ్వర్యంలో సామాజిక సేవ

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని చౌటపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల టాటా సోలార్ ద్వారా సీఎస్ఆర్ నిధుల నుంచి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు టాటా సోలార్ పవర్ ప్లాంట్ మేనేజర్ శేఖర్ కుమార్ తెలిపారు. బుధవారం చౌటపల్లి పాఠశాల విద్యార్థులకు లక్షన్నర విలువగల వాటర్ ప్యూరిఫైడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరు మండలంలో ప్రతి సంవత్సరం సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా తంగళ్ళపల్లిలో 300 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించి 150 మందికి మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశామని గుర్తు చేశారు. మండలంలో ఉచిత రక్తదాన శిబిరాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. తాండూర్ జడ్పీ హైస్కూల్లో నీటి వసతి కల్పించినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో టాటా సోలార్ పవర్ ప్లాంట్ సూపర్‌వైజర్ సాతాల సురేష్, ఇంజనీర్ ప్రవీణ్ కుమార్, రామకృష్ణ ప్రాథనోపాధ్యాయులు పి.విశ్వనాథ్, ఉపాధ్యాయులు చక్రపాణి, దేవదాస్, చౌటపల్లి మాజీ సర్పంచ్ చీమల శంకర్ గ్రామస్తులు ముదం రఘు, చీమల మహేష్, ఎనగందుల నరేష్, పాపయ్య పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకలను పునరుద్ధరించాలి

నవతెలంగాణ-జన్నారం



జన్నారం మీదుగా భారీ వాహనాల రాకపోకలు అనుమతించాలని రాష్ట్ర అటవీ శాఖ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ మోహనచంద్రను బుధవారం పట్టణవాసులు వ్యాపారస్తులు వినతి పత్రం అందించారు. భారీ వాహనాల రాకపోకలపై నిషేదం వల్ల మండలం అభివృద్ధి చెందడం లేదని ఇక్కడ ప్రజలు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అంక్షలు ఎత్తివేయలని వారికి విన్నవించారు. కార్యక్రమంలో మామిడి విజయ్ కొండపల్లి మహేష్, భూమన్న, పట్టణ వాణిజ్య వర్తకులు పాల్గొన్నారు.

పది టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-జన్నారం

అక్రమంగా తరలిస్తున్న 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున దండేపల్లి మండలం నెల్కి వెంకటాపూర్‌కు చెందిన శ్రావణ్ అనే వ్యక్తి టీఎస్ 01యూసీ 5722 నెంబర్‌గల ఐచర్ వాహనంలో 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నాడని ముందస్తు సమాచారం మేరకు పోలీస్ స్టేషన్ సమీపంలో తెల్లవారుజామున వాహనాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న రేషన బియ్యం విలువ దాదాపు 3 లక్షల వరకు ఉంటుందని, ఇట్టి బియ్యాన్ని ఇంద్రవెల్లికి చెందిన సంతోష్ అనే వ్యాపారికి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పట్టుకున్న ఐచర్ వాహనాన్ని, పైలట్‌గా వెళ్లిన కీయా సెల్టాస్ వాహనాన్ని పోలీస్ స్టేషన్‌లో ఉంచామని, కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

చెక్‌పోస్టు వద్ద అనుమతి ఎవరిచ్చారు..?

రాత్రి సమయంలో వాహనాలనకు అనుమతి లేదని చెప్పే అటవీ శాఖ అధికారులు, మండలంలోని తపాలపూర్ చెక్పోస్ట్ నుండి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం ఐచర్ వాహనాన్ని తెల్లవారుజామున నాలుగు గంటలకు ఎలా అనుమతించారని ప్రజలు, వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. భారీ వాహనాలను అనుమతించకపోవడంతో వ్యాపారాలు, హోటళ్లు అన్ని దెబ్బ తిన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయంలో పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

ఎండల నుంచి మొక్కలను సంరక్షించాలి

- భీమారం ఎంపీడీఓ రాధ రాథోడ్



నవతెలంగాణ-జైపూర్

ఎండలు ముదురుతున్నందున గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటుచేసిన నర్సరీలో పెంచుతున్న మొక్కలను సంరక్షించుకోవాలని స్థానిక ఎంపీడీఓ రాధ రాథోడ్ ఉన్నారు. బుధవారం బూరుగుపల్లి, నర్సింగాపూర్, కాజిపల్లి, ధర్మారం, దాంపూర్లలో నర్సరీల నిర్వహణను పరిశీలించారు. ఎండ వేడిమిని తట్టుకునే విధంగా గ్రీన్ నెట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. జూన్ మొదటి వారానికన్నా నాణ్యమైన మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం కాజిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఆమె మధ్యాహ్న భోజనం పంపిణీ తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. అదేవిధంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పరిసరాల్లో చెట్లు పెంచాలని సూచించారు.

ఆన్‌లైన్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-జన్నారం

ప్రస్తుతం జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జన్నారం ఎస్ఐ మార్కండేయ సర్కార్, ఏఎస్ఐ సురేష్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని రేండ్లగూడ గ్రామంలో ప్రజలకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహనకల్పించారు. తమ బ్యాంకు ఖాతా నెంబర్లు ఓటీపీ నెంబర్లు, ఎవరికి చెప్పకూడదన్నారు. బ్యాంకుల పేరుతో ఫోన్లు చేసి, మోసం చేసే ప్రమాదం ఉన్నందున, ఎవరు కూడా అలాంటి ఫోన్లకు స్పందించవద్దన్నారు. బ్యాంకు మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరుగా బ్యాంకుకు వెళ్లి అధికారులతో సంప్రదించి వారి సమస్యలను పరిష్కరించుకోవాలని, ఫోన్లో ఎలాంటి సమాచారం ఇవ్వకూడదన్నారు.

ముత్యంపల్లి పాఠశాలలో ఫేర్వెల్ డే వేడుకలు

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు ఫేర్వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర స్వామి మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం కష్టపడి చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షలలో సమయస్ఫూర్తితో ఏకాగ్రతతో ప్రశ్నలు అర్థం చేసుకుని సమాధానాలు వ్రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరి, పల్లె కృష్ణ గోపాల్ రావు, జ్యోతి, మాధవి లత, అర్చన పాల్గొన్నారు.

గిరిజనులపై అటవీ అధికారుల దాడులు ఆపాలి

నవతెలంగాణ-జన్నారం



గిరిజనులపై అటవీ శాఖ అధికారుల దాడులు ఆపాలని వారికి ఉపాధి కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శి ఎస్కె అబ్దుల్లా అన్నారు. బుధవారం మండలంలోని, మల్యాల గిరిజన గ్రామంలో గిరిజనులతో గిరిజన సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు శంకర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా ఆదివాసీ గిరిజన సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గ్రామంలోని గిరిజనులపై ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాలు దినం, దినం పెరుగుతున్నాయన్నారు. ఊరు దేవునికి నీడ కొరకు పందిరి వేసుకుంటే, పందిరి కర్రను సామాన్లన్నీ చిందరవందర చేసి, వారి పనిముట్లు గడ్డపార, పారలు, గొడ్డళ్లు గుంజుకుని వారిపై దౌర్జన్యం చేయడం అటవీశాఖ అధికారులకు తగదన్నారు. ఆ గ్రామంలో ఉన్న గిరిజన, చదువుకున్న పిల్లలకు ఎటువంటి ఉపాధి లేక, అడవిలో దొరికే వెదురు కర్ర తెచ్చుకొని తడకలు అల్లుకొని బ్రతికే పరిస్థితి ఉందన్నారు. వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరపు అశోక్ మాట్లాడుతూ, ఫారెస్ట్ వారు పెట్టిన గేటు వల్ల ఈ గ్రామానికి రాకపోకలు స్తంభిస్తున్నాయని, టైగర్ జోన్ వల్ల అడవిలో ఉన్న గిరిజనులకు ఉపాధి కరువై పస్తులు ఉండవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేస్తున్న 6 గ్యారంటీలు అమలు చేయాలని, వీరికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, వీరి పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని గ్రామానికి రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుమలత, ముడితే లక్ష్మి, అరే ఎల్లవ్వ, దాసండ్ల పద్మ, మూతి అనిత, భూమక్క ఆత్రం రాజు, నరసయ్య, వెంకటేశ పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేసిన జీఎం



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 11 మంది మెడికల్ ఇన్ వాలిడేషన్ డిపెండెంట్లకు జీఎం మనోహర్ కారుణ్య నియామక పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఏరియాలో ఇప్పటివరకు కారుణ్య నియామకాల ద్వారా 1708 మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఇతర పరిశ్రమలతో పోలిస్తే సింగరేణిలో పని స్థలాలు సమయాలు భిన్నంగా ఉంటాయని విధులకు గైర్హాజరు అయితే ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని, కష్టించి పనిచేసి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ, సీఎంఓఏఐ ప్రెసిడెంట్ రమేష్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీవైపీఎం మైత్రేయ బంధు, రాజలింగు ఓఎస్ పాల్గొన్నారు.

నస్పూర్ : కారుణ్య నియామకాలలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో నియమితులైన 13 మంది యువతీ యువకులకు జీఎం సంజీవరెడ్డి బుధవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ కారుణ్య నియామకాలు చేపడితూ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుందని అన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న ఉద్యోగులు సర్ఫేస్లో లైట్ జాబ్ కోసం ప్రయత్నాలు చేయకుండా, గైర్హాజరు కాకుండా ఉద్యోగం చేసుకోవాలని అన్నారు. అలాగే విధులను సక్రమంగా నిర్వహిస్తూ, క్రమశిక్షణతో ఉద్యోగం చేసుకోవాలని, సింగరేణిని లాభాల బాటలో తీసుకురావడానికి కృషి చేయాలని అన్నారు. ఇప్పటి వరకు శ్రీరాంపూర్ ఏరియాలో 3586 కారుణ్య నియామక పత్రాలు జరిచేయడం జరిగిందని, సింగరేణి వ్యాప్తంగా 12,446 కారుణ్య నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ఓ టు జిఎం పురుషోత్తమ రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సీనియర్ పీఓ కాంతారావు, ఏఐటీయూసీ నాయకులు ముస్కె సమ్మయ్య, కొమురయ్య, అసిస్టెంట్ సూపరిండెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.



నస్పూర్‌లో..

రోజువారీ ఆహారంలో తృణధాన్యాలు తీసుకోవాలి

నవతెలంగాణ-జైపూర్



పోషణ్ పక్వాడ కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ కవిత

గర్భిణీ స్త్రీలు, బాలింతలు క్రమం తప్పకుండా తృణధాన్యాలను ఆహారంగా తీసుకోవడం అవసరమని ఎంపీపీ గొదరి రమాదేవి లక్ష్మణ్ అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా బుధవారం ముదిగుంట గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గర్భిణీ స్త్రీలతోపాటు బాలింతలు ఎలాంటి ఆహారం తీసుకోవాలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 23 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషన్ పక్వాడ పక్షోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 3 నుండి 6 సంవత్సరాల వయసు గల పిల్లలు విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలు బాలింతలు ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రాలకు రావాలని సూచించారు. శిశువు పుట్టిన వెంటనే ముర్రు పాలు తాగించాలని, ఆరు నెలల వయసు వరకు విధిగా తల్లిపాలే తాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ సౌజన్య, జెండర్ స్పెషలిస్ట్ విజయ, అంగన్‌వాడీ టీచర్స్ రాజేశ్వరి, నిరోషా పాల్గొన్నారు.

తాండూర్ : గర్భిణీలు బాలింతలు సామాన్యులు రోజువారి ఆహారంలో అధిక ఫైబర్ గల తణధాన్యాలను వాడడం వల్ల ఆరోగ్యవంతంగా జీవించవచ్చు నని బెల్లంపల్లి సీడీపీఓ ఉమాదేవి అన్నారు. బుధవారం మండలంలోని రేపల్లెవాడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యజీవితంలో జొన్నలు, రాగులు, సజ్జలు కొర్రలు, వాడాలని తెలిపారు. మాదారం సూపర్‌వైజర్ మమత చౌటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా తల్లులకు ఆరోగ్యవంతమైన పోశాకాహారం, మిల్లెట్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శారదా, సక్కుబాయ్ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల్ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వ్యవస్థాపకులు పర్కాల మహేష్, అమరగొండ తిరుపతి ఆధ్వర్యంలో కవ్వాల్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటు కేంద్రం ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు గల్ఫ్ కార్మికులకు అన్యాయం చేశాయన్నారు. గల్ఫ్ బాధితులను పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా తుడుం సూరయ్య, అధ్యక్షుడు బాల్లే రవి, ఉపాధ్యక్షులు కండ్లే రాజలింగు, మోత్కురి అంజన్న, వార్కింగ్ ప్రెసిడెంట్ కసారపు తిరుపతి, కోశాధికారిగా పుల్ల శేఖర్, సెక్రటరీ తుడుం అనిల్, అక్రమ్ ఖాన్, జనరల్ సెక్రటరీ కుంటల నరేష్, జాయింట్ సెక్రటరీ బండి మహేష్, ముఖ్య సలహా దారు మెరుగు రమేష్, సలహాదారులు దుర్గం శ్రీనివాష్, జాడి రాజన్న, షేర్ల రాజు, కార్యవర్గ సభ్యులు అంబటి వెంకన్న, కొండపర్తి బాపన్న, తుడుం మురళీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి పన్ను వసూలు వంద శాతం పూర్తి చేయాలని మంచిర్యాల డీఎల్పీఓ సుధారాణి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్, ఎంపీఓ అనిల్ కుమార్‌తో కలిసి నర్వ, ముదిగుంట గ్రామపంచాయతీలో పర్యటించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్, గ్రామపంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసే సమావేశంలో ఆమె మాట్లాడారు. పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా కొనసాగాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల పరిధిలో ఎక్కడ కూడా ప్లాస్టిక్ కనిపించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ నర్సరీల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వందకు వందశాతం ఈజీఎస్ కూలీలు పనుల్లో పాల్గొనే విధంగా జాగ్రత్త పడాలని ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వర్లు గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో మొల్లమాంబ జయంతి



నవతెలంగాణ-జన్నారం

కవయిత్రి కుమ్మరి మొల్లమాంబ జయంతి వేడుకలను బుధవారం మండల కేంద్రంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మల్లమాంబ, చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోకన్వీనర్ శ్రీరాముల గంగాధర్ మాట్లాడుతూ రామాయణాన్ని తెలుగు భాషలో సరళంగా రచించిన ఆతుకూరి మొల్లమాంబ 1440లో జన్మించి 1530లో పరమపదించారనీ ఆమె విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పైన ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాలుగు దశాబ్దాల క్రితం నెలకొల్పారని ఆమె పేరు మీద "కథానాయక మొల్ల" అనే సినిమా కూడా 4, 5 దశాబ్దాలు క్రితమే నిర్మించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కోడూరి చంద్రయ్య పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు ఆడెపు లక్ష్మీనారాయణ, ముదిరాజ్ సంఘం మండల ఉపాధ్యక్షుడు ఐలవేని రవి, పురగిరీ క్షత్రియ పెరిక సంఘం యువ నాయకుడు లక్ష్మణ్ వర్మ, ఉప్పుల శ్రీను, ముమ్మడి రమేష్, కట్ట నాగరాజు, ముమ్మడి సాయి, మామిడిపల్లి హరీష్, మందపల్లి చారి, తోగేటి శోభన్, కొక్కొండ రాము, సందీప్, ఇందూరి కిరణ్ పాల్గొన్నారు

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

బెల్లంపల్లి రీజియన్‌లో జనరల్ మేనేజర్(సెఫ్టీ)గా విధులు నిర్వహించి రామగుండం రీజియన్‌కు బదిలీపై వెళ్తున్న కెహెచ్‌ఎన్ గుప్తాను ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్ గోపాల్ సింగ్, ఎస్ఆర్పీ 3,3ఏ డీవై జీఎం ఎస్ సంతోష్ కుమార్ వారి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గోపాల్ సింగ్ మాట్లాడుతూ గుప్తా బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎంగా విజయవంతంగా విధులు నిర్వహించి ఉద్యోగులలో రక్షణ ప్రాముఖ్యతను వివరిస్తూ ఎస్ఎంపీ, ఎస్ఓపీ ఆదరణ గురించి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అవర్ ఏమ్ జీరో హార్మ్ అనే నినాదంతో రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని దిశానిర్దేశనం చేసేవారని గుర్తు చేశారు. అంతే కాకుండా రామగుండం రీజియన్‌లో గుప్తా మార్గానిర్దేశంలో రామగుండం రీజియన్ ఎంతో ప్రగతి సాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రక్షణాధికారి జి. శ్రీదర్ రావు, గని అధికారులు ప్రేమ్ కుమార్, సాయి శ్రావణ్, గౌస్ పాషా, పీ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి మండలం మామిడి గట్టు గ్రామానికి చెందిన నాంపల్లి సంగీత (23) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతి పై రామకృష్ణాపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతురాలు డిగ్రీ పూర్తి చేసి ఇంట్లో ఉంటుందని స్థానికులు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

నాయకుల వైఖరితో బీఆర్ఎస్‌కు రాజీనామా

నవతెలంగాణ-మందమర్రి

నాయకుల వైఖరితో పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు గాలిపెల్లి సురేందర్, కూకట్ల తిరుపతి బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. స్థానిక నాయకుల వైఖరితో ఆవేదనతో బాధతో రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో పార్టీ ఆదేశాల మేరకు ముందుండి పనిచేసామని కొన్ని సంవత్సరాల నుంచి వార్డు, యూత్, సోషల్ మీడియా అధ్యక్షులుగా ఇన్‌చార్జీలుగా పార్టీ కోసం నిరంతరం కష్టపడి పని చేశామన్నారు. తాము అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మాజీ ఎమ్మెల్యే సుమన్‌కి, పిఏ శ్రీకాంత్‌కి, పట్టణ అధ్యక్షులకు ఎన్ని సార్లు కాల్స్ చేసినా కనీసం స్పందించలేదని పార్టీలో గుర్తింపు లేకపోవడం స్థానిక నాయకుల వైఖరితో మనస్థాపం చెంది ఆవేదనతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

పిల్లల మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలి

నవతెలంగాణ-తాండూర్

తోటి పిల్లల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం వల్ల పిల్లల ఆత్మస్థైర్యాన్ని పెంపొందించిన వాళ్ళమవుతామని మాదానం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మీ అన్నారు. బుధవారం వేముల కుర్తి భరత్ కుమార్ కుమారుడు రుద్ర మహర్షి పుట్టినరోజు వేడుకలను పాఠశాలలో నిర్వహించి పిల్లలందరికీ రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. పోషకులు స్థానిక నాయకుల సహకారంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను హాజరు శాతాన్ని పెంచినట్లు తెలిపారు. మాదారం ప్రభుత్వ పాఠశాలలో ముగ్గురు ఉన్న విద్యార్థుల సంఖ్యను ప్రస్తుతం 23కు చేర్చినట్లు వివరించారు. ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతి సౌకర్యాన్ని వినియోగించుకొని విద్యార్థుల పురోగతికి తోడ్పడుతున్నట్లు తెలిపారు స్థానిక నాయకులు, పోషకులు, స్వచ్ఛంద సంస్థలు సేవా దృక్పథంతో మాదారం పాఠశాల పురోగతికి తోడ్పాటు అందించాలని ఆమె కోరారు.

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

నవతెలంగాణ-కాసిపేట



మందమర్రి ఏరియాలోని కాసిపేటగనిపై 27 మంది గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. గైర్హాజరు ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా గైర్హాజరు ఉద్యోగుల సమస్యలను తెలుసుకొని వారికి అనుకూలంగా, వారి కుటుంబ పరిస్థితులను తెలుసుకొని ఉద్యోగం చేసేందుకు అన్ని రకాల అవకాశం కల్పిస్తామని, కుటుంబ సభ్యులు డ్యూటీకి వచ్చే విధంగా చూడాలని మేనేజర్ అల్లావుద్దీన్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీషాన్, బన్న లక్ష్మణ్ దాస్, సహాయ పిట్ కార్యదర్శి రాజేందర్, మహేశ్ పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని రొట్టెపల్లి చౌడుగూడకు చెందిన కుర్సింగ అజయ్(18) అనే యువకుడు మానసికి పరిస్థితి సరిగ్గా లేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. అజయ్ మేకల కాపరిగా పని చేస్తుండగా మానసిక పరిస్థితి సరిగ్గా ఉండేది కాదని, గతంలో మూడు సార్లు ఆత్మహత్యా యత్నం చేసినట్లు వివరించారు. మంగళవారం మేకలు కాయడానికి వెళ్లి వచ్చి ఇంటి వద్ద దొడ్డిలో మేకలు వదిలిపెట్టి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం అజయ్ పత్తి చేనులో తునికి చెట్టుకు చీరతో ఉరి వేసుకొని ఉండడాన్ని అజయ్ తండ్రి మహదు గమనించి బ్రతికే ఉన్నాడనుకొని అటువైపు వెళ్తున్న వారిని పిలిచి చీరను విప్పి కిందకు దించగా అప్పడికే మృతి చెంది ఉన్నాడు. ఈ మేరకు తండ్రి మహదు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అణగారిన వర్గాల అభివృద్ధి కోసం సూరజ్ పోర్టల్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశంలోని అణగారిన వర్గాల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించేందుకు ప్రధానమంత్రి సూరజ్ పోర్టల్‌ను వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. బుధవారం వర్చువల్ విధానం ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూరజ్ పోర్టల్‌ను ప్రారంభించి తన సందేశమివ్వగా అధికారులతో కలిసి వీక్షించారు. అనంతరం అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల వారికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక అభివృద్ధి జరిగిందని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రధానమంత్రి సూరజ్ పోర్టల్ ద్వారా అనేక సంక్షేమ పథకాలతో ఆర్థిక అభివృద్ధి కోసం వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి సజీవన్, ఎల్‌డీఎం మేనేజర్ కోవ హనుమంతరావు, మెప్మా పీడీ మోతిరాం, యూనియన్ బ్యాంక్ నోడల్ అధికారి తివారి, నాబార్డ్ డీడీ వీరభద్ర రావు, అధికారులు, కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని పిప్పర్‌గొంది గ్రామంలో ఎన్ఆర్ఈజీయస్ నిధులతో సీసీ రోడ్డు పనులను బుధవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గుర్నులే నారాయణ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. సీసీ రోడ్డు లేకపోవడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామానికి సీసీ రోడ్డు పనులను ప్రారంభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం ప్రకాష్, టౌన్ ప్రెసిడెంట్ అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని తాటిపెల్లి కుర్త వద్ద గల శివసిద్ధి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో బుధవారం సుబ్రమణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సుబ్రమణ్య స్వామి విగ్రహాన్ని హైదరాబాద్‌కు చెందిన రాచర్ల అనూష సత్యప్రకాష్, తంగెడిపెల్లి అర్చన ప్రవీణ్ విరాళంగా ఇవ్వడంతో వేద పండితుడు సురిచెద్ది రాధాకృష్ణతో వేదమంత్రాలతో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు ఎలుములె దత్తు, ఉపాధ్యక్షులు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి బోయర్ ప్రవీణ్, కమిటీ సభ్యులు సంపత్, బాపు, బికాజి, వాసుదేవ్, నారాయణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న గోలేటికి చెందిన శంకర్‌కు గాయలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

రేపు తైబజార్ వేలం పాట

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మున్సిపాలిటీ తై బజార్ వేలం పాట శుక్రవారం రోజున ఉదయం 11 గంటలకు పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-2025 నకూ సంబంధించిన లక్షెట్టిపేట దినసంతా, వారసంత ఉత్కూరు వారసంతలకు సంబంధించిన వేలం పాట నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇట్టి వేలంలో పాల్గొనేవారు ముందస్తుగా రూ. పదివేలు లక్షెటిపేట పురపాలక సంఘం కార్యాలయంలో చెల్లించగలరు. వేలంపాట పొందిన వారు అదే రోజు 50 శాతం రుసుము చెల్లించాల్సి ఉంటుంది. మిగతా వివరాలకు

లక్షెట్టిపేట మున్సిపాలిటీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

73 అంశాలను ఆమోదించిన మున్సిపల్ కౌన్సిల్

నవతెలంగాణ-నస్పూర్

పట్టణ అభివృద్ధి పనులపై ప్రవేశపెట్టిన 73 అంశాలను కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, వైస్ చైర్ పర్సన్ శ్రీమతి గెల్లు రజిత, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, ఆర్ఓ కె సతీష్, మున్సిపల్ సహాయక ఇంజనీర్ మధు, టీపీఎస్ ఆర్ సతీష్ పాల్గొన్నారు.



విద్యారంగ అభివృద్ధికి ఎస్ఎఫ్ఐ కృషి అభినందనీయం

నవతెలంగాణ-నస్పూర్



విద్యారంగ అభివృద్ధికి ఎస్ఎఫ్ఐ చేస్తున్న కృషి విశేషమైనదని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 18 నుండి 28 వరకు నిర్వహించిన పదవ తరగతి టాలెంట్ టెస్ట్‌లో రాణించిన విద్యార్థులకు బుధవారం నస్పూర్ మండల కేంద్రంలోని రేడియంట్ హైస్కూల్లో బహుమతులు అందజేశారు. మండల కార్యదర్శి ఈదునూరి అభినయ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అభినందన సభకు జిల్లా విద్యాధికారి యాదయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై జితేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దాగం శ్రీకాంత్, మిట్టపల్లి తిరుపతి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుల్లో రాణించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. రానున్న పదవ తరగతి పరీక్షలు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తొలిమెట్టు అన్నారు. గత 25 సంవత్సరాలుగా ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్టు నిర్వహిస్తుందని, విద్యార్థులలో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు, పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు, విద్యార్థులను మానసికంగా దృఢంగా తయారుచేసేందుకు, వివిధ రకాల టీఎస్ ఆర్జేసీ, పాలీసెట్ వంటి అనేక రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా పరీక్ష నిర్వహించామని తెలిపారు. మండల వ్యాప్తంగా 16 పాఠశాలల నుంచి 600 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. సహకరించిన ప్రభుత్వ ప్రయివేటు యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. మండల స్థాయిలో మొదటి బహుమతి సింగరేణిహై స్కూల్ ఎ.లక్ష్మీ ప్రసన్న, మార్టిన్ గ్రామర్ స్కూల్ ఏ అశ్విత, రెండవ బహుమతి రేడియంట్ హై స్కూల్ ఏమ్. అక్షిత, మూడో స్థానం ఎస్ఆర్ఆర్ కే మనోజ్, కేజీబీవీ నవ్య గెలుపొందారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు ఎలుక అరవింద్‌రెడ్డి, రాము, రమేష్, విగ్నేష్, వర్మ, మల్లేష్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయాలు కొనసాగిద్దాం



నవతెలంగాణ-హాజీపూర్

భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల ఆశయాలు కొనసాగిద్దామని పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి పోస్టర్‌లను ఆవిష్కరణ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, భారతదేశ విముక్తి కోసం, స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం తమ విలువైన ప్రాణాలను భారత జాతికి అంకితం ఇచ్చారన్నారు. ఉరితాడును ముద్దాడి అమరులయ్యారన్నారు. వారి స్ఫూర్తితో యువత యువజన పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అమెరికా, రష్యా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. దేశంలో రోజు రోజుకీ మతోన్మాదం, ఫాసిజం పెరుగుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో విఫలం అయ్యాయన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత పెడదారి పడుతున్నారన్నారు. సమానత్వం, సమసమాజ కోసం జరుగుతున్న పోరాటంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారీ విధానానికి, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తిరుగుబాటుకి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నేల 15 నుంచి 30 వరకు భగత్ సింగ్,రాజు గురు సుఖదేవ్‌ల వర్ధంతులను గ్రామ గ్రామాన, వాడవాడనా జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్, పీవైఎల్ రాష్ట్ర నాయకులు కే.మనోహర్, నాయకులు కార్తీక్, వంశీ రాజు, రాహుల్, శీను పాల్గొన్నారు.

అలరించిన వీడ్కోలు వేడుకలు



నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణసింగ్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే భయం లేకుండా నిర్భయంగా రాసి మంచి ఫలితాలు సాధించి పాఠశాల, తల్లిదండ్రులకు, మండలానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులు వారి అనుభవాలను తొమ్మిదో తరగతి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ రాంచందర్ నాయక్, ఉపాధ్యాయులు రాంచందర్, సాంబ, కవిత, రాజాబాబు, సంతోష్, సత్యనారాయణ, రమేష్, రజిత, నారాయణ, జయరాం, పరమేశ్వర్, సుమలత, హరీష్, బీసీ హాస్టల్ వార్డన్ రేష్మ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్ : మండలంలోని రాస్పెల్లి, భట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. రాస్పెల్లి పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృసతిక కార్యక్రమాలు నిర్వహించారు. హాజరు శాతం ఎక్కువ నమోదైన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో బెజ్జూరు ఎంఈఓ తోట రమేష్, హెచ్‌ఎంలు మాడవి హనుమంతు, బైరి వరలక్ష్మి, చిలుకూరు సత్యనారాయణ, ఉమాకాంత్, సుమన్, కార్తీక్, ఏటుకూరి శ్రీనివాస్ రావు, ఇందారపు ప్రకాష్, తంగడపల్లి రాకేష్, మహిపాల్, గాయత్రి, దివ్యశ్రీ, రవికుమార్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు తొమ్మిదవ తరగతి విద్యార్థులు వీడ్కోల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ డుబ్బుల నానయ్య కౌటాల సీఐ సాదిక్ పాషా పాల్గొన్నారు. విద్యార్థులు ఆటపాటలతో నృత్యాలు చేశారు. విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జైరాజ్, ఉపాధ్యాయులు దేవాజీ, ఆత్మారాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని ధర్మారావుపేట పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఉన్న అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్ నాయక్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సతీష్ కుమార్, రాజేశం, లత, తిరుపతి, భాగ్యలక్ష్మి, నజియ, సులోచన, వెంకటేశ్, సంగీత పాల్గొన్నారు.

ఎన్నో ఏండ్ల పోరాటం.. నెరవేరిన కల

- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం
- కార్పొరేషన్ల ప్రకటనపై హర్షం వ్యక్తం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్థికంగా వెనకబడిన కులాలకు వెన్నుదన్నుగా నిలుస్తూ ప్రభుత్వం 16 కార్పోరేషన్లను ప్రకటించడాన్ని స్వాగతిస్తూ ఆయా కుల సంఘాలు సంబరాలు జరుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకాలు నిర్వహించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం మహాత్మ గాంధీ చౌక్‌లో జాతిపిత గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పలాభిషేకం చేశారు. కులస్తులంతా జయజయ ద్వానాలతో హోంత్తించారు. ఈ సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్తవార్ రాజేశ్వర్ మాట్లాడుతూ దశాబ్దాలుగా వైశ్యులు చేస్తున్న పోరాటాలకు కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం హర్షణీయమన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుతో నిరుపేద వైశ్యులకు ఉపాధి రుణాలు లభించే వీలు కలిగిందన్నారు. బీజేపీ నాయకురాలు అనిత మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో కులవృత్తులపై ఆధారపడిన ఎంతో మంది పేదలకు లబ్ది చేకూరుతుందన్నారు. ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ ఇదే స్ఫూర్తితో పేద ఆర్యవైశ్యులకు ఇందిరమ్మ ఇండ్లు, ఇతర విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి హరీష్, దెబ్బడి ఉల్లాస్, జిల్లా మహాసభ నాయకులు కౌటిక్ రాజు, రాజేష్, మోహన్, మహిళ ప్రతినిధులు జయ, సునయన, కీర్తి, అనిత పాల్గొన్నారు.

గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో

గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి మేకల అశోక్ మాట్లాడుతూ 75 ఏండ్ల పాలనలో అనేక ప్రభుత్వాలు మారాయన్నారు. కానీ గంగపుత్ర కార్పొరేషన్ ఏ ప్రభుత్వం కూడా ఏర్పాటు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడిన మూడు నెలల కాలంలోనే కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయమన్నారు. దీంతో మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర అధ్యక్షుడు బొంపెల్లి భూమన్న, డైరెక్టర్ చిట్ల రాజేష్, ఎల్లుల అశోక్, సభ్యులు కుమ్మరి కృష్ణ, చిట్ల శ్రీను, చిన్నరాములు, బొంపెల్లి కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో..

ఎన్నో ఎండ్లుగా మున్నూరు కాపు కార్పోరేషన్ కోసం నిరాంతరం పోరాటం చేస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమని మున్నూరుకాపు తాలుక అధ్యక్షుడు కాళ్ల విఠల్ అన్నారు. బుధవారం అంబేద్కర్ చౌక్‌లో సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి ధన్యవాదలు తెలిపారు. అనంతరం స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కాళ్ల విఠల్ మాట్లాడుతూ మున్నూరు కాపుల ఆకాంక్ష కార్పొరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఫైనాన్స్ కార్పొరేషన్ కోసం ఉద్యమిస్తున్నామని నేడు తమ కల సాకారం అయిందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుతో పేదలుగా జీవిస్తున్న కాపులకు లబ్ది చేకూరుతుందన్నారు. కాగా నిధులను కూడా విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కలల శ్రీనివాస్, మధు, గంట సురేష్, శ్రీనివాస్, దెశెట్టి ప్రభ, జోగు రమణి, సంధ్య సౌజన్య, సుధారాణి పాల్గొన్నారు

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో

అటూ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలోనూ కార్పొరేషన్ ఏర్పాటును స్వాగతిస్తూ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కొండలక్ష్మణ్ బాపూజీ చౌక్ వద్ద పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయంలో పద్మశాలకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొద్ది నెలలల్లోనే కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. దీంతో అగకుండా సరైన నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శంకరయ్య, బాస దత్తు, అడెల్లు, శంకర్, గణేష్, ఉశన్న, గంగన్న, సాంబశివ, శివరాజ్, సంతోష్, ఉశన్న పాల్గొన్నారు

సుదీర్ఘపోరాటాల తర్వాత కార్పొరేషన్ ఏర్పాటు

సుదీర్ఘపోరాటం, ఆందోళనల తర్వాత ఎట్టకేలకు ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు అవుతోందని, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు సలేంద్ర శివయ్య తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం బాధ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. ముదిరాజ్‌ల అభివృద్ధి జరగాలంటే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు కావాలని పాదయాత్ర చేపట్టామని, దానికి ఫలితం దక్కిందన్నారు. బీసీ వర్గాల్లో అతిపెద్ద సామాజికవర్గం అయిన ముదిరాజ్ సంఘాన్ని మొదటిస్థానంలో ఉంచడాన్ని హర్షిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్పొరేషన్ ద్వారా అన్నిరంగాల్లో అభివద్ధి చెందడానికి అవకాశం ఉన్న దృష్ట్యా బీసీ-ఏ అంశాన్ని సైతం రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడమే కాదని, అందుకు తగిన విధంగా భారీ నిధుల కేటాయింపు జరగాలని పేర్కొన్నారు.



ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...


పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో...


మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో...